ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- కల్వకుర్తి డిపోఎదుట ఆర్టీసీ కార్మికుల ధర్నా

కల్వకుర్తి డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులు

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 20 : కల్వకుర్తి పట్టణంలోని ఆర్టీసీడిపో ఎదుట ఎస్‌డబ్ల్యూఫ్, సీఐటీయూ రాష్ట్ర సంఘాల పిలుపుమేరకు శుక్రవారం కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి గేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జోనల్ సహాయ కార్యదర్శి రాజబాబు, రీజియన్ ఉపాధ్యక్షుడు రాంచంద్రయ్య మాట్లాడుతూ ఆర్టీసీకి రావల్సిన రూ.430కోట్లు రీయంబర్స్ చేసి అన్ని ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా నమోదైన కేసులను సానుభూతితో ఎత్తివేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్టీసీఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు పరిపూర్ణయ్య, నాగయ్య, రాజగోపాల్, ఆనంద్, అంజయ్య, రాములు, సురేశ్ తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్ నివారణపై విస్తృత ప్రచారం

కలెక్టరేట్‌లో జెండాఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 20 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణకోసం చేపట్టిన విస్తృత ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్యలక్ష్మి జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాప్తి, నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, విస్తృతంగా అవగాహన కల్పించేందుకు చేపట్టిన ప్రచార కార్యక్రమా న్ని ప్రారంభించడం జరిగిందని అక్టోబర్ 31వ తేదీ వరకు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అన్ని ప్రభుత్వ దవాఖానలు, ఆయుష్మా న్ ఆరోగ్య మందిర్, ఆరోగ్య ఉపకేంద్రాలలో హెచ్ఐవీ స్క్రీనింగ్, రక్తపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి రవికుమార్, డీపీఎం రేణయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

షీటీం సేవలను వివరిస్తున్న వెంకటస్వామి

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 20 : విద్యార్థినులకు ఏదైనా ఆపద తలెత్తితే వారు ఏ మాత్రం అధైర్య పడకుండా ఆత్యస్థైర్యంతో ముందుకు సాగాలని షీటీం కల్వకుర్తి ఇన్‌చార్జి వెంకటస్వామి విద్యార్థినులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని వివీస్ హైస్కూల్‌లో విద్యార్థులకు షీటీం సేవలను అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అపరిచితులతో విద్యార్థినులు చాలాజాగ్రత్తగా ఉండాలని వారు మాటలు కలిపి మన వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసేందుకు ప్రయత్నిస్తారని అలాంటి వారితో అప్రమత్తంగా ఉండడంతో పాటుగా వారికి ఎలాంటి వ్యక్తిగత వివరాలు తెలియజెయొద్దని సూచించారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాములు, కరెస్పాండెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్‌లెట్స్ ఇచ్చి.. మానవత్వం చాటి..

డెంగ్యూ రోగికి ప్లేట్‌లెట్స్ ఇస్తున్న రాజు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 20 : డెంగ్యూ వ్యాధితో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తికి ప్లేట్‌లెట్స్ ఇచ్చి మానవత్వం చాటుకున్నాడు బైక్ మెకానిక్. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్న కొల్లాపూర్ పట్టణానికి చెందిన రాధకు అత్యవసరంగా ఏ పాజిటివ్ ప్లేట్‌లెట్స్ అవసరం పడింది. దీంతో కుటుంబసభ్యులు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాయూత్ సమన్వయకర్త కుమార్‌ను సంప్రదించారు. కుమార్ పి లుపు మేరకు జిల్లా కేంద్రానికి చెందిన బైక్ మెకానిక్ రాజు తన ఏ పాజిటివ్ ప్లేట్‌లెట్స్ ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ మేరకు దవాఖానలో బ్లడ్‌బ్యాంక్ రక్తనిధి కేంద్రంలో ఎస్‌డీపీ ద్వారా ప్లేట్‌లెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదాత అయిన బైక్ మెకానిక్ రాజు ప్రతి ఆరునెలలకు ఒకసారి రక్తదానం చేస్తుంటాడని, అతని గ్రూప్ వివరాలు తెలియడంతో అత్యవసర పరిస్థితుల్లో విషయాన్ని తెలియజేయడంతో స్పందించి వెంటనే దవాఖనకు చేరుకొని ప్లేట్‌లెట్స్ అందజేయడంపై అందరూ అభినందించారన్నారు. తోటివ్యక్తి ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశ్యంతో రాజు చేసిన త్యాగాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్లడ్‌డొనేషన్ కన్వీనర్ రాజుకుమార్, ల్యాబ్ టెక్నీషియన్లు ఆంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో అధ్యక్షుడిగా సురేశ్‌గౌడ్ ఎంపిక

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 20 : కల్వకుర్తి టీఎన్జీవో యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నచెర్ల సురేశ్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోఉన్న సమావేశ మందిరంలో యూనియన్ మాజీఅధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాఘవేందర్‌రెడ్డి, లింగం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

KIDNY STONES
★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం. అనుభవంతో 100% గ్యారంటీ, జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580
NT- 332617

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331771-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- *జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబు*

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజేశ్‌బాబు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 20 : కక్షిదారులు పంతాలను పక్కనపెట్టి లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబు, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి సబిత, జడ్జి మౌనిక కోరారు. శుక్రవారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు, రాష్ట్ర హైకోర్టు సూచనల మేరకు ఈనెల 28వ తేదీన 7వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా పరిధిలోని కోర్టుల్లో అనేక రకమైన కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, కోర్టులో వేయని వివాద కేసులు ఉంటే అవి కూడా ముందస్తు పిటీషన్లు ఫిర్యాదుగా స్వీకరించి సమన్యాయం అందించడానికి లోక్ అదాలత్ మంచిపాత్రను పోషిస్తుందన్నారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి కోర్టుల్లో ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకు జాతీయ లోక్‌అదాలత్ వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు న్యాయమూర్తులు అందుబాటులో ఉంటారన్నారు. కక్షిదారులు కలిసేలా ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సారి కొత్తగా సుప్రీంకోర్టు తీర్పుకు వచ్చిన నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టులో ఉన్న తగాదాలను సైతం ఇరుపక్షాల వారు తమ న్యాయవాదులతో జిల్లా న్యాయస్థానంలో నిర్వహించే లోక్‌అదాలత్‌లో సంప్రదిస్తే ఆ కేసు పూర్వాపరాలను పరిశీలించి రాష్ట్ర హైకోర్టుకు సమర్పించడం ద్వారా కక్షిదారులు ఢిల్లీకి వెళ్ళాల్సిన అవసరం ఉండకుండా కేసుల పరిష్కారం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని కొత్తగా తీసుకురావడం జరిగిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్టులలో తీర్పు చెప్పినప్పుడు ఒకరు విజయం సాధిస్తే మరొకరు అపజయమవుతారని, దీనికి విభిన్నమైన రీతిలో లోక్‌అదాలత్‌లో కక్షిదారుల మధ్యవర్తిత్వం ద్వారా మాట్లాడుకోవడంతో వివాదాన్ని సున్నితంగా పరిష్కారం చేసుకోవడం జరుగుతుందన్నారు. సత్వర న్యాయంకోసం సుప్రీంకోర్టు వారు అ నేక సందర్భాల్లో కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు లోక్‌అదాలత్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఆరుసార్లు లోక్‌అదాలత్ ద్వారా 56,451 కేసులు పరిష్కరించామన్నారు. ఈనెల 28న లోక్‌అదాలత్ ద్వారా 18వేలకుపైగా కేసులను పరిష్కరించేలా టార్గెట్ పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాధాకృష్ణ, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

తాసీల్దార్‌కు సన్మానం..

వెల్దండ, సెప్టెంబర్ 20 : మండల నూతన తాసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కార్తీక్‌కుమార్‌ను శుక్రవారం ఐక్యత ఫౌండేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ చాంబర్‌లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయనకు పూలమాల శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పీఆర్‌టీయూ కమిటీ ఎన్నిక

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 20 : మండల పీఆర్‌టీయూ నూతన కమిటీని శుక్రవారం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బాబురావు, ఉపాధ్యక్షురాలిగా లలిత, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, మహిళా కార్యదర్శిగా నవీనకుమారిలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి కృష్ణారెడ్డి తెలిపారు.

విజయడైరీ పాలబిల్లులు చెల్లించాలి

వెల్దండ, సెప్టెంబర్ 20 : విజయడెయిరీ పాడిరైతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన విజయడెయిరీ బాధ్యులు కూన దశరథం అన్నారు. శుక్రవారం పలువురు విజయ డైరీ బాధ్యుడు రాష్ట్రవిజయ డెయిరీ చైర్మన్ గుత్తాఅమిత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పాడి రైతుల పాల బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

కేజీబీవీలో వైద్యపరీక్షలు

చారకొండ, సెప్టెంబర్ 20 : మండల కేంద్రంలో కేజీబీవీలో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే కల్వకుర్తి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి డాక్టర్ రమణకుమార్ విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో మంజుల, ఏఎన్‌ఎం లక్ష్మి పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

బిజినేపల్లి, సెప్టెంబర్ 20 : పాలెం, వడ్డెమాన్ రైతు వేదికల్లో శుక్రవారం రైతులకు భూమి, నీరు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భం గా సహాయ వ్యవసాయ సంచాలకుడు పూర్ణచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా బిందుసేద్యం, స్ప్రింక్లర్ల సేద్యం గురించి వివరించారు. యాసంగిలో వరికి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, ప్రభాకర్‌రెడ్డి, ఉన్నారు.

నిప్పంటుకొని పైపులు దగ్ధం

అగ్నికి కాలిపోతున్న హెచ్‌డీ పైపులు

కల్వకుర్తి, సెప్టెంబర్ 20 : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని హెచ్‌డీ పైపులు దగ్ధమైన ఘటన కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా గాంధీనగర్ కాలనీలో వ్యాపారి రాఘవేందర్‌స్వామికి చెందిన గోదాంలో హెచ్‌డీ పైపులసుట్టకు ప్రమాదవశాత్తు నిప్పంటుకున్నది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. ఘటనలో హెచ్‌డీ పైపులు అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు సమాచారం.

కూల్ డ్రింక్స్ షాపులో చోరీ

వెల్దండ, సెప్టెంబర్ 20 : గురువారం అర్ధరాత్రి వైన్స్ పక్కన్న ఉన్న కూల్‌డ్రింక్స్ షాపులో చోరీ జరిగిన సంఘటన వెల్దండలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకృతి గార్డెన్ వద్ద ఉన్న వైన్స్ అనుబంధపు కూల్‌డ్రింక్స్ షాపులో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షెట్టర్లు పగులగొట్టారు. అందులో ఉన్న రూ.13వేలతో పాటు, రూ.28వేల విలువ చేసే కూల్‌డ్రింక్స్, సిగరేట్లు, ఇతర సామగ్రి , 9సీసీ కెమెరాల ధ్వంసం చేసి ఎత్తుకుపోయినట్లు యజమానులు కుశ, అనిల్ తెలిపారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వగా విచారణ నిర్వహించారు.

పలుచోట్ల వర్షం..

చారకొండ, సెప్టెంబర్ 20 : మండల కేంద్రంతో పాటు శిరుసనగండ్ల, మర్రిపల్లి, తుర్కలపల్లి, శాంతిగూడెం తదితర గ్రామాల్లో శుక్రవారం వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా వర్షం రాకపోవడంతో రైతులు సాగుచేసిన పంటలు వాడిపోతున్న నేపథ్యంలో కురిసిన వర్షంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 20 : తిమ్మాజిపేట మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వర్షం పడింది. ఈదురుగాలులతో కూడిన వర్షం దాదాపు అరగంటపాటు కురిసింది. 15రోజులుగా వర్షం లేక ఆందోళనలో ఉన్న రైతులకు ఈ వర్షం ఉరటను ఇచ్చింది. ముఖ్యంగా ఎండలలో వాడేదశకు చేరుకున్న పత్తిపంటకు ఈ వర్షం ఉపిరి పోసిందని రైతులు తెలిపారు.

సాయిచంద్ మరణం తీరనిలోటు

ఊర్కొండలో కేక్‌కట్ చేస్తున్న సాయిచంద్ సతీమణి రజిని

ఊర్కొండ, సెప్టెంబర్ 20 : తెలంగాణ ఉద్యమ నాయకుడు మాజీ గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్ జయంతి వేడుకలను ఊర్కొండలో ప్రధాన కూడలిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాయిచంద్ సతీమణి మాజీ గిడ్డంగుల చైర్మన్ రజిని హాజరై సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల నాయకులు సాయిచంద్ చేసిన సేవలను గుర్తుంచుకొని ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, శ్రీను, గిరినాయక్, రమేశ్, రవీందర్, సాంబశివుడు, సాయిచంద్ అభిమానులు భారీ సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

వెల్దండలో..

వెల్దండ, సెప్టెంబర్ 20 : ప్రముఖ గాయకుడు, ఉద్యమకారుడు, మాజీ గిడ్డంగుల శాఖ చైర్మన్ సాయిచంద్ లేకపోవడం తెలంగాణ సమాజానికి తీరనిలోటని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం సాయిచంద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, నిరంజన్, బాలస్వామి, ప్రభాకర్, లింగం, ఆనంద్, అశోక్, హన్మంత్, అమర్‌సింగ్, కొండల్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, జగ్గూనాయక్ ఉన్నారు.

వెల్దండలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

విద్యుదాఘాతంతో మాజీసర్పంచ్ మృతి

ఎల్లయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి రూరల్/కల్వకుర్తి సెప్టెంబర్ 20 : మండలంలోని తుర్కలపల్లి గ్రామ మాజీసర్పంచ్ ఎల్లయ్య(54) విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన ఘటనా గురువా రం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కలపల్లికి చెందిన మాజీసర్పంచ్ ఎల్లయ్య గురువా రం రోజువారి మాదిరిగా తన వ్యవసా య పొలానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు అతడిని కల్వకుర్తి దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడు ఎల్లయ్యకు భార్య ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. 2019 పంచాయితీ ఎన్నికల్లో తుర్కలపలి సర్పంచ్‌గాఎల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నకోబడినట్లు నాయకులు గుర్తుచేసుకున్నారు.

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

బీఆర్ఎస్ మాజీసర్పంచ్ ఎల్లయ్య మృత దేహానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో పాటు నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, మాజీ వైస్ఎంపీపీ గోవర్ధన్, పార్టీ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

గిరిజన హామీలు అమలు చేయాలి

- 9నెలలుగా ప్రభుత్వం కాలయాపన
- బంజారా భాష గోర్‌బోలిని.. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలి
- లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 20 : గిరిజన హామీలను అ మలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవినాయక్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. పలువురు నాయకులు అధ్యక్షుడికి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 కోట్ల బంజారాలు మాట్లాడే భాష గోర్‌బోలిని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, మేనిఫెస్టోలో 16 రకాల వాగ్దానాలను కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ప్రకటించారని, దీంతో ఆ పార్టీని నమ్మి గిరిజనులు గణనీయంగా ఉన్న 45 నియోజకవర్గాల్లో ఓట్లువేశారని గుర్తు చేశారు. అయినా గిరిజన హామీలు అమలను మరిచారన్నారు. మా ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. హామీల అమలు ఆలస్యం కావడంతో గిరిజనులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉన్నదని, గిరిజన సంక్షేమశాఖ రాజ్యాంగ బద్ధమైన అధికారాలు కలిగి ఉన్నదని, 5వ షెడ్యూల్ ప్రాంతంతోపాటు గిరిజనులకు అనేక హక్కులు చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. గిరిజన ఎమ్మెల్యేలతో కూడిన సలహా మండలిని ఇంత వరకు నియమించలేదన్నారు. గిరిజనులకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉండాల్సిన గిరిజన శాఖ మంత్రి కూడా నియమించలేదని, దీంతో వారు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించుకునేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. ప్రజాపాలనగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులను పరిపాలనలో భాగస్వామ్యం చేయకుండా వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం తక్షణమే స్పందించి డాక్టర్ తేజావత్ బెల్లయ్యనాయక్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా నియమించడంతోపాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. మూడు ఎస్టీ కార్పొరేషన్లకు విధివిధానాలను రూపొందించాలని, ఏటా ఒక్కో కార్పొరేషన్‌కు ఇస్తామ న్న రూ.500 కోట్లను బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలన్నారు. అంబేద్కర్ అభయహస్తం పథకంతో ప్రతి కుటుంబానికి రూ.12 లక్షల సాయాన్ని ఈ ఏడాది నుంచి అమలు చేయాలని, రాష్ట్రంలో పోడు భూముల సాగుదారులందరికీ హక్కు పత్రాలు అందజేయాలన్నారు. మైదాన ప్రాంత గిరిజనులకోసం కొత్తగా ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబాబాద్, నిజాంబాద్, మహబూబ్‌నగర్‌లో ఐటీడీఏలను ఏర్పాటు చేసి, రూ.500 కోట్లు కేటాయించాలన్నారు. సమ్మక్క, సారలమ్మ గిరిజన గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా ప్రతి గూడెం, తండా, గ్రామపంచాయతీలకు రూ.25 లక్షలను ఈ ఏడాది నుంచి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి చిన్న కృష్ణనాయక్, రాష్ట్ర కార్యదర్శి ఇస్లావత్ చందర్‌నాయక్, ఆంగోతు లక్ష్మణ్‌నాయక్, మాన్యానాయక్, కిషన్‌నాయక్, సత్యంనాయక్ పాల్గొన్నారు.

వృద్ధురాలికి చేయూత

చారకొండ, సెప్టెంబర్ 20 : మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు రాగిఫణి యశోద ఒంటరిగా జీవనం గడుపుతుంది. ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకొని బీజేపీ మహిళా మోర్చా అధికార ప్రతినిధి తిరుమల లావణ్యగౌడ్ శుక్రవారం పరామర్శించారు. ఆమెకు రూ.10వేలు నగదు, బట్టలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సేవా భావంతో శివకుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఆమె వెంట మహిళలు, గ్రామస్తులు ఉన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు అందజేత

అమ్రాబాద్, సెప్టెంబర్ 20 : పదరలో సీబీఎమ్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ చిక్కుడు అనురాధ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు స్వయంఉపాధి కల్పించేందుకు అందజేస్తున్నామన్నారు. మహిళలు అన్నిరంగాల్లో స్వయంకృషితో ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అచ్చంపేట టౌన్, సెప్టెంబర్ 20 : అచ్చంపేట పట్టణంలోని నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అచ్చంపేట ఏఈ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తి నుంచి అచ్చంపేటకు వచ్చే 132 కేవీ లైన్ మరమ్మతులు ఉండడంతో నియోజకవర్గ పరిధిలోని అచ్చంపేట, లింగాల, బల్మూర్, ఉ ప్పునుంతల, అమ్రాబాద్, పదర మండలాల పరిధిలోని నేడు మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

మార్కెట్ చైర్‌పర్సన్‌కు సన్మానం

అచ్చంపేట, సెప్టెంబర్ 20 : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ నూతన చైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం చేపట్టిన అంతటి రజితమల్లేశ్, డైరెక్టర్ రాత్లావత్ కృష్ణలను సన్మానించారు. గిరిజన సంఘం నాయకులు శుక్రవారం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌యార్డులో కలిసి శాలువ, పూలమాలచే సత్కరించారు.

తపస్ సభ్యత్వ నమోదు

అచ్చంపేట టౌన్, సెప్టెంబర్ 20 : తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆయాపాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు శివ, పుట్టా శ్రీనివాస్‌రెడ్డి, శివప్రసాద్, తిరుపతయ్య, రమేశ్ పాల్గొన్నారు.

హామీలను అమలుచేయాలి

చారకొండ, సెప్టెంబర్ 20 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కావలి వెంకటయ్య శుక్రవారం డిమాండ్ చేశారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా వివక్ష చూపిస్తుందని చెప్పారు. దివ్యాంగులకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

అలరింపజేసిన జబర్దస్త్ కమెడియన్‌షో

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 20 : పెద్దకొత్తపల్లిలోని బీసీ కాలనీలో ఫ్రెండ్స్‌యూత్ ఆధ్వర్యంలో గణేశ్ యువకబృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జబర్దస్త్ కమెడియన్లషో ప్రేక్షకులను అలరింపజేసింది. గురువారం రాత్రి కమిడియన్లు వినోద్, నాగతేజ, గడ్డం నవీన్, చిట్టిబాబు, అప్పారావు, మోహన్‌లాల్ వివిధ రకాల షోల ద్వారా అలరింపజేశారు. అనంతరం గణేష్ యువక బృందం నిర్వాహకులను మాజీ ఎంపీటీసీ నర్సింహ, శివశంకర్, శశికళ కమెడియన్లను సన్మానించారు.

కంప్యూటర్, నోటుపుస్తకాల వితరణ

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 20 : మండలంలోని ముకురాలలో ప్రాథమికోన్నత పాఠశాలకు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో కంప్యూటర్ నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ రీజియన్ చైర్మన్ సత్యనారాయణ, డీవో రమేశ్, సంతోష్, హెచ్ఎం రామేశ్వర్ ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబర్ 20 : ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నరేశ్‌బాబు ప్రజలను కోరారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ అబ్దుల్ సలాం, శానిటరి ఇన్‌స్పెక్టర్ మురళితో పాటు కార్యాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది ఉన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

మార్చాల విజయడెయిరీ అధ్యక్షుడిగా శ్రీశైలం

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 20 : మార్చాల గ్రామ విజయ డైరీ అధ్యక్షుడిగా కంకల్ల శ్రీశైలం ఎన్నికయ్యారు. శుక్రవారం మార్చాలలో విజయడెయిరీ అధ్యక్షుడు రాంరెడ్డి, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో డెయిరీకి నిర్వహించిన ఎన్నికలలో ఐదుఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి శ్రీశైలం పల్స రాంచంద్రయ్యపై విజయం సాధించాడు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 20: జిల్లాకేంద్రంలో మిలాద్ ఉన్‌నబీమాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం భక్తిశ్రద్ధల మధ్య ర్యాలీ ముస్లింలు శోభయాత్ర నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త కీర్తిని కొనియాడుతూ యువకులు నాత్‌యా కలాం పాడుతూ ర్యాలీ నిర్వహించారు. సంతబజార్ నుంచి ప్రధాన వీధుల్లో ర్యాలీ కొనసాగింది. అనంతరం వక్ఫ్ కాంప్లెక్స్‌పై జెండాను ఆవిష్కరించారు.

మహిళ అదృశ్యం

అచ్చంపేట రూరల్, సెప్టెంబర్ 20 : మండలంలోని బుడ్డ తండా గ్రామ పంచాయతీకి చెందిన ముడా వత్ చిట్టి గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని భర్త మత్రు శుక్రవారం సాయంత్రం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకోని మహిళ ఆచూకీ గురించి విచారణ చేస్తున్నామని అచ్చంపేట ఎస్సై రాములు తెలిపారు.

ఉపముఖ్యమంత్రికి సన్మానం

అచ్చంపేట టౌన్, సెప్టెంబర్ 20 : ఎస్ఎల్‌బీసీ పరిశీలనకు వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్కను డిప్యూటీ డీఎంహెచ్‌వో తారాసింగ్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం పట్టణంలో 100 పడకల దవాఖానలో వైద్యపరికరాలు, వసతులపై మాట్లాడారు.

కొట్రలో ఘనంగా గణనాథుడి నిమజ్జనం

వెల్దండ, సెప్టెంబర్ 20 : కొట్ర గ్రామంలో జైశ్రీరాం యూత్ ఆధ్వర్యంలో గణనాథున్ని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా లడ్డూ వేలంపాటలో సుధీర్ రూ.40,116వేలకు దక్కించుకోగా, రెండోలడ్డూ వెంకటయ్యాగౌడ్ రూ.24,116 వేలకు దక్కించుకున్నాడు.

లింగాలలో..

లింగాల, సెప్టెంబర్ 20 : లింగాలో 12వార్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులు లడ్డూ వేలంపాటలో రూ.56 వేలు పలికినట్లు ఉత్సవ కమిటీ, నిర్వాహకులు తెలిపారు.